ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 26 డిసెంబరు 2024



షాబాద్ : మరియాపురంలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్

క్రిస్మస్ వెలుగులు



శంషాబాద్ : బాలయేసు పాఠశాలలో నాటక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



మొయినాబాద్ మెథడిస్ట్ చర్చిలో దైవ సందేశం వినిపిస్తున్న ఫాదర్

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం పండగ నేపథ్యంలో చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. ఇళ్లపై స్టార్ గుర్తులను ఏర్పాటు చేసుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు ప్రభువు కీర్తనలు, గీతాలాపనలు ఆలపించారు. అనంతరం కేకులు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



మొయినాబాద్ మెథడిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి చందుపట్లగూడలో కురుస్తున్న వర్షం

కురిసిన ముసురు.. పెరిగిన చలి

ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

- సెలవు కావడంతో ఇళ్లకే పరిమితమైన జనం
- మర్పల్లిలో 16.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/ఘట్‌కేసర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో పగలు వాతావరణం కూడా చల్లబడింది. అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిలల్లాలో పలు చోట్ల ముసురు పడింది. మరికొన్ని చోట్ల వాతావరణం చల్లబడి చిరు జల్లులు కురిశాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం, మొయినాబాద్, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తుంపరలా వర్షం పడింది. వికారాబాద్ జిల్లా వర్షం లేకున్నప్పటికీ వాతావరణం చల్లబడింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక ప్రారంభమైన ముసురు బుధవారం ఉదయం 10 గంటల వరకు కురిసింది. బుధవారం క్రిస్మస్ సందర్భంగా సెలవు కావడంతో వర్షం, చలి తీవ్రత కారణంగా జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 16.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో 18.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



మొయినాబాద్‌లో కురుస్తున్న తుంపరుల వాన

తగ్గేదే లే!

18 రోజులుగా సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగులు తగ్గేదేలే అంటున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని 18 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్న ఉద్యోగులు.. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరు కొనసాగుతుందని తేల్చి చెబుతున్నారు. రోజుకో తీరుగా నిరసన తెలుపుతూ వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- మూతపడిన ఎమ్మార్సీ భవనాలు
- అధ్వానంగా కేజీబీవీల పనితీరు
- ఆందోళనను పట్టించుకోని ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)



యాచారంలో మూతపడిన ఎమ్మార్సీ భవనం

యాచారం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని సమ్మెబాట పట్టడంతో కేజీబీవీలు, ఎమ్మార్సీ భవనాలు వెలవెలబోతున్నాయి. జిల్లాలో కస్తూర్బా పాఠశాల, ఎమ్మార్సీలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట 18 రోజులుగా రోజుకో విధంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇన్నిరోజులుగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఫలితంలేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. డిమండ్లు నెరవేరే వరకు పోరు కొనసాగిస్తామని ఉద్యోగులు తేల్చిచెబుతున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి విద్యాపరంగా

మిగతా 8వ పేజీలో...

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

- విద్యాశాఖలో వెయిటేజ్ కల్పించాలి.
- పదవీ విరమణ పొందిన వారికి, విధి నిర్వహణలో మృతిచెందిన వారికి ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల సాయమందించాలి
- ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ అమలు చేయాలి.
- ఉద్యోగ భద్రత కింద జీవిత బీమా కింద రూ.20లక్షలు, ఆరోగ్య బీమా కింద రూ.10లక్షల సాయమందించాలి.
- కేజీబీవీ, ఎమ్మార్సీలో ఉద్యోగులను, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.



త్రిశూల్ కార్యక్రమంలో అందెల శ్రీరాములుయాదవ్

ధర్మ పరిరక్షణే విశ్వహిందూ పరిషత్ ధ్యేయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజాన్ని ఏకీకృతం చేస్తూ లోక కల్యాణంతో పాటు సమాజ సేవ చేయడంలో 60 ఏళ్లుగా విశ్వహిందూపరిషత్ ఎంతో కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బుధవారం మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయ ప్రాంగణంలో నిర్వహించిన త్రిశూల్ దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధర్మపరిరక్షణే ధ్యేయంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ పని చేస్తున్నాయన్నారు. బజరంగ్‌దళ్ చేపట్టిన త్రిశూల్ దీక్షతో యువతలో ఎంతో చైతన్యం వస్తుందన్నారు. గోహత్యలు, దేవాలయ విధ్వంసం, హిందూ మహిళలపై లవ్ జిహాద్‌లను అరికట్టేందుకు బజరంగ్‌దళ్ చేస్తున్న కృషి అద్వితీయమన్నారు. అదేవిధంగా మహేశ్వరంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాపయ్యగౌడ్, మాధవాచారి. కె.వెంకటేష్, హరిబాబు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

కల్యాణం.. కమనీయం

కనుల పండువగా వేణుగోపాల స్వామి పరిణయం

కేశంపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ శివారులో నంబయ్య గుట్టపై వెలిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం కమనీయం సాగింది. పండితులు వేణయ్య బృందం వేదమంత్రల నడుమ మాజీ వైఎస్ ఎంపీపీ అనురాధ-పర్వత్ రెడ్డి, మాజీ సర్పంచ్ మంజుల- మల్లేష్ దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. వేడుకను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు ఆనంద్ రెడ్డి అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్ రావు, చిర్ర చంద్రయ్య, యేన్నం శ్రీధర్ రెడ్డి, లంకాల సురేష్ రెడ్డి, నరసింహా, రామచంద్రి, చిర్ర శ్రీను, సరికొండ రమేష్, తుమ్మల గోపాల్, శ్రీశైలం, యాదయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ధ్యాన మార్గం విశ్వశాంతికి దోహదం

పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి





పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్

ఆమనగల్లు/ కడ్తాల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్రీజీ చూపిన ధ్యాన మార్గం విశ్వశాంతికి దోహద పడుతుందని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి, ధ్యాన గురువు పరిణతి పత్రీజీ అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు-3 అట్టహాసంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఐదవ రోజు వేడుకలకు ధ్యానులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే క్వాంటం లైఫ్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు డాక్టర్ న్యూటన్ కొండవీటి పాల్గొని తల్లిదండ్రులు, పిల్లల బాంధవ్యాలపై గురించి వివరించారు. క్రిస్మస్ పండగ నేపథ్యంలో ట్రస్ట్ నిర్వాహకులు కేక్‌కట్ చేశారు.

గట్టిప్పలపల్లిని మండలంగా చేయాలి



7

- 55వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు
- ర్యాలీ నిర్వహించిన మహిళలు, యువకులు

ఘనంగా వాజ్‌పేయి జయంతి




8

- మాజీ ప్రధాని చిత్ర పటానికి నివాళులు
- ఆయన సేవలను కొనియాడిన నాయకులు

ఎగ్‌బాకింది

పెరిగిన కోడి గుడ్డు ధర



- బెంబేలెత్తుతున్న మధ్యతరగతి కుటుంబాలు
- గుడ్ల కొనుగోలుకు వెనుకడుగు



చేవెళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోడి గుడ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. ధర రోజు రోజుకూ ఎగబాకుతుండటంతో మధ్యతరగతి కుటుంబాలు వాటిని కొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కార్తీక మాసం తర్వాత చికెన్, మటన్ ధరలు స్వల్పంగా పెరిగాయి. కానీ గుడ్డ రేటు మాత్రం రూ.7 నుంచి రూ.8కు చేరుకుంది. వారం రోజుల క్రితం రూ.6 ఉన్న గుడ్డు ధర.. ప్రస్తుతం ఏకంగా రూపాయి పెరిగింది. హోల్‌సేల్‌గా 30గుడ్లు ఉన్న ట్రే ధర రూ.180కి అమ్ముతున్నారు. అయితే కోడి గుడ్డు ధర ఇంతలా పెరగడంతో నియోగదారులు షాక్ అవుతున్నారు. చికెన్ ధర మాత్రం గతంలో కిలో రూ. 180 నుంచి 210 మధ్య ఉండగా, ఇప్పుడు కూడా అదే రేటు ఉంది. మటన్ ధర గతంలో రూ.800 నుంచి రూ.900 వరకు ఉండగా, ప్రస్తుతం అదే ధర కొనసాగుతుంది.

రోజుకు లక్షకు పైమాటే..

చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో రోజువారీ కోడి గుడ్ల వాడకం లక్షకు పైమాటే ఉంటుందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్ నేపథ్యంలో కేకుల తయారీకి కోడి గుడ్ల వినియోగం ఎక్కువై ధరలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు.

గుడ్డు కొనే పరిస్థితి లేదు



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి భారంగా ఉంది. ఇప్పుడు కూరగాయలతో పాటు గుడ్డు ధర కూడా పెరిగిపోవడంతో ఏం కొనలేకపోతున్నాం.. ఏం తినలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

- సతీష్‌యాదవ్, వినియోగదారుడు చేవెళ్ల

సదాలక్ష్మమ్మ జయంతి వేడుక

పరిగి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉద్యమ నాయకురాలు, తొలి మహిళా మంత్రి, డిప్యూటీ స్పీకర్ ఎస్సీ వర్గీకరణ వ్యవస్థాపక సిద్ధాంత కర్త సదాలక్ష్మమ్మ 96వ జయంతిని బుధవారం పరిగిలో నిర్వహించారు. సదాలక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉద్యమ కారులు పి.రామన్న మాదిగ, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.రామకృష్ణ మాట్లాడుతూ.. సదాలక్ష్మమ్మ ఆశయసాధనకు కృషిచేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం పరితపించారని పేర్కొన్నారు. ఆమె విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు రత్నం, వినోద్, వెంకటయ్య, భీమయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సదాలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

విజ్ఞాన యాత్రకు తరలిన విద్యార్థులు

దోమ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిర్సంపల్లి పాఠశాల విద్యార్థులకు బుధవారం విజ్ఞాన, విహారయాత్రకు వెళ్లారు. వరం గల్ జిల్లా లక్నవరం, వేయిస్తంభాల గుడి, రామప్ప, భద్రకాళి ఆలయం, వరంగల్ పోర్టు లాంటి ప్రదేశాలను తిలకించారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.కేశవులు మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నాటి చెరువులు, కట్టడాలపై విద్యార్థులకు తెలియపర్చామన్నారు.

నేటి నుంచి ముద్దాయిపేట్ ఎల్లమ్మ జాతర

యాలాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముద్దాయిపేట్ ఎల్లమ్మ తిరుణాల జాతర ఈ నెల 26 నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ ధర్మకర్త, మాజీ ఎంపీటీసీ దేవగారి రాములు బుధవారం తెలిపారు. గురువారం నేడు రాత్రి 8 గంటలకు అమ్మవారి ఊరేగింపు, 27న సాయంత్రం సిడే, భజన, 28న సాయంత్రం చుక్క బోనాలు, పోతురాజు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జాతర సందర్భంగా రోజూ భజన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై జాతరను విజయంతం చేయాలని రాములు కోరారు.



ఆలయంలోని ఎల్లమ్మ అమ్మవారు



30న హకీంపేటలో సీపీఎం సభ



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆర్.మహిపాల్, రైతులు

కొడంగల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలని ఈ నెల 30న దుద్యాల మండలంలోని హకీంపేట్ గేటు వద్ద నిర్వహించే సీపీఎం సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ తెలిపారు. బుధవారం ఆయన లగచర్లలో రైతులతో కలిసి సభ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. లగచర్ల ఘటనలో అరెస్టయిన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి రైతులు, వారి కుటుంబీకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి సీపీఎం రాష్ట్రవర్గ సభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నర్సింహారావు, కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పూజల్లో శ్రీనివాస్‌గుప్తా, తదితరులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందని పీసీసీ కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలోని శివాలయం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాలయంలో లింగానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అ పరమ శివుడి అనుగ్రహం అందరిపైనా ఉండాలని ప్రజలందరూ పాడి పంటలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో జేఏసీ నాయకులు

గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలి

తలకొండపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తేల్చి చెప్పారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 55వ రోజుకు చేరాయి. దీక్షలకు మద్దతుగా గ్రామంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, మహిళలు, యువకులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రభుత్వపరంగా సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. గట్టిప్పల పల్లి మండలకేంద్రం ఏర్పాటుకు అన్ని విధాలా అనుకూలంగా ఉందని తెలిపారు. దీక్షల్లో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు ఆంజనేయులు గౌడ్, ముత్యాలు, ఏదుల రవి, మన్న వెంకటయ్య, మల్‌రెడ్డి, కరుణ, పరుషోత్తం, సాయిబాబా, మహవీర్, యాదయ్య, కృష్ణయ్య, జంగయ్య, మోహన్ రెడ్డి, కృష్ణయ్య, బాలయ్య కిషన్, రాములు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు చెక్కు ఇస్తున్న అశోక్‌యాదవ్

పూర్వజన్మ సుకృతంతోనే సామాజిక సేవ

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పూర్వజన్మ సుకృతం ఉంటేనే సామాజిక సేవ చేయడానికి ముందుకు వస్తారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభిప్రాయపడ్డారు. దాతల సహకారంతో చేపట్టిన షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి చటాన్‌పల్లికి చెందిన నందారం అశోక్‌యాదవ్ రూ.10లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. బుధవారం కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యేకు చెక్కును ఇచ్చి, సమాజంపై తనకున్న సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా చిన్న వయస్సులోనే సేవా కార్యక్రమాలకు ముందుకు వచ్చిన దాత అశోక్‌యాదవ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అశోక్, నందిగామ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్గానిక్ క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా రైతు బృందం

సేంద్రియ పంటలు ఆరోగ్యకరం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు మనకు ఆరోగ్యకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అంకుశాపూర్‌లోని పిట్టల ఆర్గానిక్ ఫామ్‌ను బుధవారం రైతులతో కలిసి సందర్శించారు. రసాయన ఎరువులతో పండించిన పంటలతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. పిట్టల ఆర్గానిక్ క్షేత్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్రం నిర్వహకులు పిట్టల శ్రీశైలం, కృష్ణవేణి, రైతులు ఉన్నారు.



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

క్రీడలతో శారీరక దారుఢ్యం

దోమ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక, మానసిక దారుఢ్యానికి దోహదం చేస్తాయని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అయినాపూర్‌లో బుధవారం టీచర్ లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం 2007 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు నిర్వహించిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఘనంగా మైసమ్మ తల్లికి బోనాలు

నవాబుపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నారేగూడలో బుధవారం మైసమ్మ తల్లి బోనాలను నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్ని పూజలు చేశారు. గ్రామంలో బోనాల ఊరేగింపు, జోగిని శ్యామల ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకలుఉ తిరుపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, పర్మయ్య, రఘునందన్‌రెడ్డి, రాజు, శివకుమార్, అనంతయ్య, శివరాజ్, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగారంలో పోచమ్మ బోనాలు

ధారూరు: నాగారంలో కొనసాగుతున్న తుల్జాభవానీ జాతరలో భాగంగా బుధవారం పోచమ్మ దేవతకు బోనాలను సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేంగింపుగా అమ్మవారి ఆలయానికి చేరి ప్రదక్షిణలు నైవేద్యాన్ని సమర్పించారు.



నాగారంలో బోనాల ఊరేగింపు



మేడ్చల్ పెద్దచెరువుకు మహర్దశ

- కట్టపై సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు
- మరో రూ.50లక్షలకు ప్రతిపాదన

మేడ్చల్ టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పెద్దచెరువు కట్టకు మహర్దశ కలగనుంది. చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దటానికి పాలకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కానున్నాయి. మూడు వందల ఎకరాల విస్తీర్ణం కలిగి.. వేల ఎకరాలకు సాగు నీరందించే పెద్ద చెరువును అభివృద్ధి పరచాలని 30 ఏళ్లుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నప్పటికీ కట్ట మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదు. పెద్ద చెరువును అభివృద్ధి చేయటంతో పాటు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని ఎన్నికలకు ముందు గత పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే ఉన్నాయి. ప్రస్తుతం చెరువు కట్టను అభివృద్ధి పరచటానికి మున్సిపల్ పాలకవర్గం తీర్మానిస్తూ రూ.50లక్షలు కేటాయించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మున్సిపల్ పాలకవర్గం గడువు 2025 జనవరి 27న ముగియనుండటంతో ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ మణికంఠగౌడ్ చెరువు అభివృద్ధికి రూ.కోటి నిధులు విడుదల చేయాలంటూ ప్రతిపాదనలు పెట్టారు. దాంతో ముందుగా రూ.50వేలు కేటాయిస్తామని, అదనంగా మరో రూ.50లక్షలను సమకూరుస్తామని కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

మరో రూ.50 లక్షలకు ప్రతిపాదన

ప్రస్తుతం రూ.50లక్షల మున్సిపల్ నిధులు కట్ట అభివృద్ధికి కేటాయిస్తున్నప్పటికీ అదనంగా మరో రూ.50లక్షలు జాతీయ రహదారుల సంస్థ ద్వారా మంజూరు చేయాలని మున్సిపల్ తరఫున ప్రతిపాదన పంపనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మేడ్చల్‌లోని జాతీయ రహదారిపై వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నందున.. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దాంతో మేడ్చల్ పట్టణానికి చేరుకునే వాహనాల కోసం సర్వీసు రోడ్డుకు బదులుగా పాత జాతీయ రహదారిగా ఉన్న పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేయాలని కోరుతూ జాతీయ రహదారుల సంస్థకు కలెక్టర్ ద్వారా ప్రతిపాదన పంపాలని మున్సిపల్ పాలకవర్గం, స్థానిక అధికారులు నిర్ణయించారు.

కట్ట అభివృద్ధితో సాఫీగా ప్రయాణం

పెద్ద చెరువు కట్టపై సీసీ రోడ్డు వేస్తే రాకపోకలు సాఫీగా సాగుతాయి. ప్రస్తుతం జాతీయ రహదారి వంతెన పనులు కొనసాగుతున్నందున.. మేడ్చల్ చెక్‌పోస్టు నుంచి పట్టణానికి చేరేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరం నుంచి మేడ్చల్ పట్టణానికి చేరుకునే వాహనాలు చెక్‌పోస్టు నుంచి పెద్ద చెరువు కట్ట మీదుగా పట్టణంలోకి ప్రవేశించే వీలుంటుంది. అదే విదంగా చెక్‌పోస్టు నుంచి అత్వెల్లి వెళ్లే వాహనాలు కట్ట మీదుగా జాతీయ రహదారితో సంబంధం లేకుండా లింకు రోడ్ల సాయంతో మేడ్చల్ దాటి వీలుంది. అదేవిధంగా చెరువు కట్ట మీదుగా మేడ్చల్ పట్టణం దాటి వెళ్లే వాహనాలు కింది బస్తీ చేపల మార్కెట్ మీదుగా మహవీర్ చౌరస్తా, పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి తుమ్మ చెరువు కట్ట వద్దకు చేరుకుంటాయి. అక్కడి నుంచి సాఫీగా పట్టణం దాటే వీలుంటుంది. దాంతో పట్టణంలో నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు పెరిగి కొత్తదనం సంతరించుకునే వీలుంటుంది.

సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి



మున్సిపల్ తరఫున మంజూరు చేసిన రూ.50లక్షలతో కట్టపై పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టలేం. అదనంగా మరో రూ.50లక్షలు జాతీయ రహదారుల సంస్థ కేటాయిస్తే పట్టణంలోని చేపల మార్కెట్ నుంచి చెక్‌పోస్టు సుతారి గూడ చౌరస్తా జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టవచ్చు. ఎన్‌హెచ్‌ఏకు ప్రతిపాదన పంపాం.

- నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

కట్ట అభివృద్ధితో పూర్వవైభవం



నా వార్డు పరిధిలోని చెరువు కట్టను అభివృద్ధి పరిచేందుకు యత్నించాను. నిధుల కొరత కారణంగా ఇన్నాళ్లు సాధ్యపడలేదు. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిల్ తరఫున నిధులు కేటాయించారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు అవసరమైన అదనపు నిధులు కేటాయించేందుకు పాలకవర్గం సుముఖంగా ఉంది.

- మణికంఠ గౌడ్, కౌన్సిలర్, 6వ వార్డు



సీఎంను కలిసిన ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని బుధవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి మల్లు రవి పుష్పగుచ్ఛం అందజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమంగా కార్మికుల వినియోగం



మాట్లాడుతున్న సంగీతఠాకూర్

తాండూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంట్లో పనిచేస్తున్న పారిశుధ్య పనివారిని సొంతానికి వాడుకోకుండా ప్రజల పనులకు పంపాలని కౌన్సిలర్ సంగీతఠాకూర్ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడారు. చైర్‌పర్సన్ తన ఇంట్లో మున్సిపల్ వర్కర్లతో పనిచేయించుకుంటున్నారని.. 'ప్రభుత్వ పని వారు మీ ఇంట్లో పని చేయడానికి ఉన్నారా? అని ప్రశ్నించారు. జవాన్లను బెదిరించేందుకు రిజిష్టర్లు చెక్ చేస్తున్నారా? అని ప్రశ్నించారు. వార్డుల్లో పారిశుధ్య కార్మికులు లేక జవాన్లు ఇబ్బందులు పడుతుంటే మున్సిపల్ లేబర్‌తో మీ ఇంట్లో ఎలా పనిచేయించుకుంటారని ప్రశ్నించారు. మున్సిపాలిటీని చెత్త మున్సిపాలిటీగా మార్చుతున్నారని కమిషనర్, చైర్‌పర్సన్లపై ఆమె మండిపడ్డారు. పారిశుధ్య పనులు సరిగ్గాచేయక ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌ల బారిన పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్రా యాత్రకు తరలిన ముస్లింలు



ఎయిర్‌పోర్టులో ముస్లింలు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్రా యాత్రకు బుధవారం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ముస్లింలు తరలివెళ్లారు. కాగా, ఆ బృందంలో తెలుగు రాష్ట్రాల్లోని నలుమూలల నుంచి మహిళలు, వృద్ధులు, చిన్నారులు కలిసి మక్కా మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు తరలివెళ్లారు. మొత్తం 50మంది ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరగా కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆసిఫ్ మొహ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ మక్కాలోని మదీనాలో ప్రార్థనలతో మనశ్శాంతితోపాటు మానసికంగా, శారీరకంగా దోహదపడుతుందన్నారు. యాత్ర పూర్తయ్యేవరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

తండాలను కలిపి జీపీగా ఏర్పాటు చేయాలి

నందిగామ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండకుంట తండా, పెద్దకుంట తండా, చిన్నకుంట తండాలను కలిపి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆయా తండాల ప్రజలు వినతిపత్రం అందజేశారు. మూడు తండాల్లో మొత్తం జనాభా 750 మంది ఉన్నామని, 350 ఓట్లు ఉన్నాయని ఎమ్మెల్యేకు తెలిపారు. ప్రస్తుతం నందిగామ గ్రామపంచాయతీకి అమ్లెట్ తండాలుగా ఉన్నాయన్నారు. నందిగామకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నామని, అక్కడికి వెళ్లాలంటే బైపాస్ రోడ్డు, రైల్వేట్రాక్ దాటి వెళ్లాలని.. ప్రమాదాలు సంభవిస్తున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో శ్రీనునాయక్, గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ



చైర్‌పర్సన్ గీతా నర్సింహను సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతీ ఒక్కరికి రైతు భరోసా అందిస్తుందని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గీతను మండల పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన నాయకులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతా నర్సింహను మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకనుగుణంగా అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు చెప్పారు. దేశంలోనే రుణమాఫీ సాహసోపేత నిర్ణయమని అన్నారు. రైతులు ధాన్యాన్ని మార్కెట్ యార్డ్‌ల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, సంపత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, నాయకులు శ్రీశైలం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



రెడ్డి సేవా సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, రెడ్డి నేతలు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా రెడ్డి కులస్థులందరూ ఐక్యతను చాటి, ఆపదలో ఉన్నవారి ఆదుకోవడానికి ముందుకు రావాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. షాద్‌నగర్ రెడ్డి సేవా భవనంలో బుధవారం సంఘం అధ్యక్షుడు కె. మధన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రెడ్డి సేవా సంఘం, రెడ్డి యువజన సేవా సంఘాల 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డిల హక్కుల సాధన, అభివృద్ధికి రెడ్డి సంఘాలన్నీ ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రెడ్డిలు సైతం సంఘ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. డీసీసీబీ జిల్లా డైరెక్టర్ కంకంటి మంజులారెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ రెడ్డి మహిళా సంఘం భవన నిర్మాణం కోసం కొనుగోలు చేసే స్థలంలో సగం డబ్బును తాను చెల్లిస్తానని హామీ ఇచ్చారు. మిగిలిన సగం డబ్బును తన సొంత గ్రామమైన మేకగూడ రెడ్డి సంఘం సభ్యులు సమకూరుస్తారని తెలిపారు. రెడ్డి మహిళా భవన నిర్మాణానికి రెడ్డిలు పూర్తి సహకారం అందించాలని కోరారు. షాద్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సులోచనా కృష్ణారెడ్డి, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, మేకగూడ సింగిల్ విండో మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బి.జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి నాయకులు గుర్రం రవీందర్‌రెడ్డి, ఎం.నర్సింహారెడ్డి, అరుంధతిరెడ్డి, జి.వసంతారెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, పి.అంజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎ.నరేష్‌రెడ్డి, సి.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన డిగ్రీ కాలేజీ విద్యార్థినులు

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి అంకుశాపూర్‌లో నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థినుల ఆటల పోటీల్లో మహేంద్రహిల్స్ మహిళా డిగ్రీ కళాశాల బాలికలు హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 27న తమిళనాడు, దుండిగల్‌లోని జేఎన్‌టీయూ ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించే 46వ బాలికల జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో మహేంద్ర హిల్స్ కాలేజీకి చెందిన అనూష, కల్పన పాల్గొంటారని ప్రిన్సిపాల్ స్నేహలత బుధవారం తెలిపారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

కీసర రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్. మల్లారెడ్డి అన్నారు. బుధవారం 12వ వార్డులో రూ.28లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, వైస్‌చైర్మన్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు అనురాధ, సరిత, నాయకుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతుల దహనం



మనుస్మృతి కాపీలను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాండూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తాండూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి కాపీలను దహనం చేశారు. డిసెంబరు 25న అంబేడ్కర్ మహారాష్ట్రలోని కొలబా(నేటి రాయఘడ్) జిల్లాలో మనుస్మృతి కాపీలను తగులబెట్టిన విషయాన్ని నాయకులు గుర్తుచేశారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, నాయకులు అంజిలప్ప, బలరామ్, అంజి, పకీరప్ప, అశోక్, విజయేందర్, నవీన్, అమృతయ్య, శ్యాంసంగ్ పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, పీడీఎస్‌యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని కాలరాసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు చూస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద, బడుగు బలహీన వర్గాలు తమ హక్కుల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల నాయకులు మహేశ్, వెంకటయ్య యు.రమేశ్‌బాబు, దస్తప్ప, సాయిలు పాల్గొన్నారు.


కేశంపేట : న్యూ అపోస్టోలిక్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


కందుకూరు : బేతెల్ షరోన్ ఏజీ చర్చిలో చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేస్తున్న ఎస్సై సైదులు

ఏసు మార్గం అనుసరణీయం

- పాస్టర్లు, ప్రజాప్రతినిధులు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పెద్దసంఖ్యలో హాజరైన క్రైస్తవులు


చౌదరిగూడ : కొందుర్గు చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్, నాయకులు


చేవెళ్ల : దామరిగిద్ద చర్చిలో సందేశం వినిపిస్తున్న పాస్టర్


కొత్తూర్ : రెడ్డిపాలెం సెయింట్ జోసఫ్ చర్చిలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కడ్తాల : వేడుకల్లో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు


ఆదిభట్ల : మరియమ్మ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

చేవెళ్ల/శంకర్‌పల్లి/షాబాద్/కొత్తూర్/చౌదరిగూడ/కేశంపేట/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మాడ్గుల/కందుకూరు/మహేశ్వరం/శంషాబాద్/ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల/యాచారం/మొయినాబాద్ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చేవెళ్ల, మూడిమ్యాల్, మల్కాపూర్, కందవాడ, పామెన, గుండాల్, ఆలూర్, అంతారం, దుద్దాగు, ఎన్కేపల్లి, దామరిగిద్ద, ఊరెళ్ల, తంగడ్‌పల్లి, ఖానాపూర్, తదితర గ్రామాల్లో వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుంచే చర్చీల్లో క్రైసవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను ప్రతీ ఒక్కరు చదివి మంచి నడవడిక నేర్చుకోవాలని పాస్టర్లు తెలిపారు. దామరిగిద్దలో క్రైస్తవులు ప్రార్థనల అనంతరం గ్రామంలో ర్యాలీ తీసి ఏసుక్రీస్తు ఆటపాటలతో అలరించారు. శంకర్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ఉదయమే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి తినిపించుకున్నారు. షాబాద్ మండలంలోని మరియపురం, కేశవగూడ, బోనగిరిపల్లి, నాగర్‌గూడ, షాబాద్ తదితర గ్రామాల్లోని చర్చిల్లో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఫాదర్లు, పాస్టర్లు ఏసు క్రీస్తు సందేశాన్ని భక్తులకు వినిపించారు. షాబాద్‌లో జైభీమ్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేశమోళ్ల అంజనేయులు క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ రెడ్డిపాలెంలోని సెయింట్ జోసఫ్ చర్చి, ఫాతిమాపూర్‌లోని ఫాతిమామాత చర్చిని దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫాతిమామాత చర్చిని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లు దర్శించుకుని, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్లు సైమన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు క్రైస్తవులకు సందేశాలను వినిపించారు. ఫాతిమామాత చర్చి, సెయింట్ జోసఫ్ చర్చి కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కాగా, ఏసుక్రీస్తు అందరికీ ఆదర్శప్రాయుడని, లోకరక్షకుడని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కొందుర్గు చర్చిలో ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డిలు ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, విశ్వం, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ పెంటయ్య, ఎంపీటీసీ మాణెయ్య, తదితరులున్నారు. కేశంపేట మండలం పాటిగడ్డ, పాపిరెడ్డిగూడ, కేశంపేట, చౌలపల్లి, నిర్ధవెల్లిలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేశంపేట న్యూ అపోస్టోలిక్ చర్చిలో పాస్టర్లు కృష్ణయ్య, సునీల్ జాకబ్, రాంచంద్రయ్యల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఇమ్మాన్యుయేల్ బంజారా ప్రేయర్ చర్చిలో జరిగిన వేడుకల్లో ఎంటీ పిదెల్ఫియా చర్చి పాస్టర్ జాన్, చైర్మన్ పంతూనాయక్, క్రైస్తవులతో కలిసి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కడ్తాల్ మండల కేంద్రంలో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. కడ్తాల కృపా, యహోనా మిస్సి మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరాల్లో నిర్వహించిన వేడుకల్లో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డిలున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు చంద్రధన, రామకృష్ణాపురం, గట్టిప్పలపల్లి, పడకల్‌లో క్రిస్మస్‌ను జరుపుకున్నారు. కాగా, ఏసుప్రభు మార్గాన్ని అనుసరిస్తే పగ, ద్వేశాలు ఉండవని పాస్టర్ సోలోమోన్ రాజు అన్నారు. మాడ్గుల మండలంలోని పాతబ్రాహ్మణపల్లిలోని అగ్నిజ్వాల ప్రేయర్‌హాల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహేశ్వరం మండలంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీలో క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. కందుకూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు క్రిస్మస్ వేడుకలను అట్టహాసంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని బేతెల్ షరోన్ ఏజీ చర్చిలో ఎస్సై సైదులు చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేశారు. నేదునూరు, జైత్వారం, బాచుపల్లి, కేకే బస్తీలోని చర్చిల్లో వేడుకలు జరుపుకున్నారు. యాచారం మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సెయింట్ గ్రిగోరియస్ బాలాగ్రామ్ సంస్థలో చదువుతున్న విద్యార్థులకు ఆ సంస్థ తరఫున స్వీట్లు పంచిపెట్టి దుస్తులు అందించారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల పరిధిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మాజీ ప్రధాని శత జయంతి సందర్భంగా నివాళి


శంకర్‌పల్లి : వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, రత్నం తదితరులు

చేవెళ్ల/శంకర్‌పల్లి/ఇబ్రహీంపట్నం/కందుకూరు/యాచారం/షాద్‌నగర్ అర్బన్/కేశంపేట/చౌదరిగూడ/ఆమనగల్లు/ కడ్తాల్/ మాడ్గుల/శంషాబాద్/మొయినాబాద్ రూరల్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వాజ్‌పేయి జయంతి సందర్భంగా శంకర్‌పల్లి మండల కేంద్రంలో చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, మండలాధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా నాయకులు తదితరులున్నారు. బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా యువ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. వాజ్‌పేయి సేవలను ప్రజలు ఏనాడూ మరువరని మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. బోసుపల్లి ప్రతాప్, నర్సింహారెడ్డి, ముత్యాల భాస్కర్, తదితరులున్నారు. బీజేపీ రాష్ట్ర సంఘటన్ కార్యదర్శి చంద్రశేఖర్‌జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డిలు కందుకూరు మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్ రెడ్డిలతో కలిసి వాజ్‌పాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మండల ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా వైస్‌గవర్నర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, తదితరులున్నారు. బీజేవైఎం రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ రవీందర్‌రెడ్డిలు యాచారం మండల కేంద్రంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, బీజేవైఎం రాష్ట్ర నాయకులు శాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బీరప్ప, నాయకులున్నారు. వాజ్‌పేయి శతజయంతిని పురష్కరించుకొని షాద్‌నగర్ బీజేపీ కార్యాలయం వద్ద నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, ఎం.రాము, బాల్‌రెడ్డి, ఎస్. శ్యాంసుందర్‌రెడ్డి, ప్రవీణ్, జె.నర్సింహ, మోహన్ సింగ్, బాల్‌రాజ్, కె.శివ, సుధాకరప్ప తదితరులున్నారు. అలాగే కేశంపేట మండల పరిధిలోని కొత్తపేటలో బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో వాజ్‌పేయి జయంతిని బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి పాల్గొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని మండలాధ్యక్షుడు పెద్దయ్య ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలకు నివాళులర్పించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆమనగల్లులో జరిగిన కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సంఘటన్ మంత్రి చంద్రశేఖర్‌జీ పాల్గొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో నిర్వహించిన జయంతిలో బీజేపీ మండలాధ్యక్షుడు మన్యనాయక్, నాయకులు భగీరథ, రెడ్యనాయక్, తదితరులున్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందకిషోర్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి శతజయంతిని నిర్వహించారు. జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్ రెడ్డి వాజ్‌పేయి జయంతి సందర్భంగా మొయినాబాద్ మండలంలోని భాస్కర ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.


కందుకూరు : వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న చంద్రశేఖర్‌జీ, పక్కన ప్రేమేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి

శ్రీనివాస్ యాదవ్‌కు పరామర్శ

తలకొండపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ను బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. శ్రీనివాస్ యాదవ్ తండ్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జంగయ్య యాదవ్ ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు వెల్జాలలో శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పరామర్శించారు. జంగయ్య యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జంగయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

తగ్గేదేలే!

వెనకబడిన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు గురుకుల విధానంలో చదువుతో పాటు భోజనం అందించడానికి 2014లో అప్పటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా కేజీబీవీలు ఏర్పాటు చేసింది. విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా, ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇకపోతే మిగిలిన విభాగాల్లో అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, మండల స్థాయిలో విధులు నిర్వర్తించే సీఆర్‌పీలు ఎంఐఎస్‌లు, కో ఆర్డినేటర్లు, డేటా ఆపరేటర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్‌పీలు జిల్లా స్థాయిలో పీపీవోలు, సిస్టమ్ ఎనలిస్టులు టెక్నికల్ పర్సన్‌లు డీఎల్ఎంటీ మెసెంజర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

కేజీబీవీలు, ఎమ్మార్సీల్లో ఇబ్బందులు

జిల్లాలోని 27మండలాల్లో 729 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 20 కేజీబీవీల్లో 472మంది ఉద్యోగులు, డీపీవోలు 10మంది, సీసీవోలు 27మంది, సీఆర్‌పీలు 78మంది, మెస్సెంజర్లు 18 మంది. ఐఈఆర్‌పీలు 30మంది, ఎంఐఎస్‌లు 18మంది. పీటీఐలు 76మంది పనిచేస్తున్నారు. వీరంతా సమ్మెలో ఉండటంతో కస్తూర్బా పాఠశాలల పనితీరు దారుణంగా తయారైంది. రాత్రి వేళ బాలికల భద్రత వంటవారికి తలకు మించిన భారంగా మారింది. ప్రధానంగా ఎంఈఓలకు ఇబ్బందులు అధికమయ్యాయి. ప్రతీరోజు బడుల్లో మధ్యాహ్న భోజనం తీరు, ఉపాధ్యాయుల హాజరు తదితర వివరాలను పరిశీలన, పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రాల్లో వసతులు ఏర్పాటు తదితర పనులు భారంగా మారాయి. సమ్మె కారణంగా ఎమ్మార్సీ భవనాలు మూతపడ్డాయి. దాంతో ఎంఈవోలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బోధన సిబ్బంది రాకపోవడంతో తరగతులు కొనసాగక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మార్సీలో విధులు నిర్వర్తిస్తున్న వారికి నెలకు రూ.19వేల వేతనమందిస్తున్నారు. 2009 నుంచి కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లకు నెలకు రూ.26వేలు, ప్రత్యేకాధికారులకు నెలకు రూ.32,500 వేతనాలిస్తున్నారు. ఈ వేతనాలు మరింత పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై చాలాకాలంగా కలెక్టర్, డీఈవోలకు వినతిపత్రాలందించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

నిలిచిన కార్యకలాపాలు

మండల వనరుల కార్యాలయంలో విధులు నిర్వర్తించే సీఆర్‌పీలు, సాంకేతిక నిపుణులు, కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో లేక మండలాల నుంచి కలెక్టర్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు పంపించే మధ్యాహ్న భోజనం తదితర నివేదికలు నిలిచిపోయాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కొనసాగే బియ్యం పంపిణీ, బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు తదితర కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏళ్లతరబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నాం. వేతనాలు పెంచడంతో పాటు రెగ్యులరైజ్ చేయాలి. రోగాల బారిన పడితే ఆరోగ్యశ్రీ కింద సాయం అందడం లేదు. అధికారులు నిర్లక్షంగా వ్యవహరించడం తగదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించాలి. అప్పటివరకు సమ్మె కొనసాగిస్తాం.

- రాధాకృష్ణ, సమగ్ర శిక్ష ఉద్యోగి, యాచారం

డిమాండ్లు న్యాయమైనవే..



సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలాకాలంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారి డిమాండ్లు న్యాయమైనవే. వేతనాలు పెంచడంతో పాటు రెగ్యులరైజ్ చేస్తే వారికి న్యాయం జరిగినట్లు అవుతుంది. ఉద్యోగులకు కనీసం ఆరోగ్యశ్రీ కూడా వర్తించడం లేదు.

- పాండురంగారెడ్డి, ఎంఈవో, యాచారం

కనుల పండువగా మహాపడిపూజ


పూజలో ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

షాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : స్వామి యే శరణం అయ్యప్ప అంటూ చందన్‌వెళ్లి గ్రామం మార్మోగింది. మండల పరిధిలోని చందన్‌వెళ్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి గృహంలో అయ్యప్పస్వామి పడి పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీరాములు, శేఖర్, రవీందర్‌నాయక్, వెంకట్‌రెడ్డి, రాఘవాచారి, గోపాల్, రాఘవేందర్, స్వాములు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దు

- ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్

ఆమనగల్లు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేవారు ముందుగానే ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతులు పొందాలని, అనుమతి లేకుండా జరుపుకునే వేడుకల్లో మద్యం వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బద్యనాథ్ చౌహాన్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన లేకుండా జరుపుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని ఆయన సూచించారు. మద్యం షాప్‌లు ప్రభుత్వం అనుమతించిన సమయంలోనే తెరిచి ఉంచాలని ఆయన తెలిపారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని ఫంక్షన్ హాల్స్, రిసార్ట్‌లలో నూతన సంవత్సరం వేడుకల్లో మద్యం వినియోగిస్తే ముందుగా ఎక్సైజ్ శాఖ నుంచి రూ. 9 వేలు చెల్లించి మద్యం అనుమతి పొందాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఈవెంట్లలో అనుమతి లేకుండా మద్యం వినియోగించినా.. అనుమతి లేని విదేశీ మద్యం వినియోగించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

క్రైం కార్నర్

వ్యక్తి మరణానికి కారణమైన
కారు డ్రైవర్‌కు నోటీసులు

యాచారం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తక్కళ్లపల్లి తండా వద్ద మంగళవారం సాగర్ రహదారిపై నుంచి తండాకు చెందిన హరినాయక్ నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొని మృతిచెందాడు. ఈమేరకు నిర్లక్ష్యంగా కారు నడిపని హరినాయక్ మృతికి కారకుడైన డ్రైవర్ రమేష్‌నాయక్‌కు బుధవారం బీఎన్ఎస్ సెక్షన్ 41 కింద నోటీస్ అందించినట్లు సీఐ ఎ.నర్సింహరావు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మునుపెన్నడూ లేనివిధంగా పేదలకు వైద్య చికిత్సలకు పెద్దఎత్తున ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కల్వకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్లు గీతా నర్సింహ, మనీలసంజీవ, మాజీ సర్పంచ్‌లు ఆనంద్ కుమార్, సుదర్శన్‌రెడ్డి, నాయకులు, గోలి సురేందర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, జెల్ల రమేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య


విద్యార్థినిని అభినందిస్తున్న యాదయ్య

చేవెళ్ల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ఈనెల 22న శంషాబాద్‌లో జరిగిన మినీ రోల్‌బాల్ కాంపిటీషన్‌లో మండల పరిధిలోని వివేకానంద పాఠశాలలో 6వ చదువుతున్న హుదా ఫాతిమా ప్రతిభ కనబర్చింది. దాంతో అస్సాంలో జరిగే జూనియర్స్ మినీ రోల్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు టీచర్లతో కలిసి హుదా ఫాతిమా బుధవారం ఉదయం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నరేష్, చేవెళ్ల మండల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, ఊరెళ్ల మాజీ సర్పంచ్ జంహగీర్, తదితరులు ఉన్నారు.

అవయవ దానంపై అవగాహన కలిగి ఉండాలి

ఆమనగల్లు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలు ప్రాణ దాతలుగా నిలుస్తారని, రక్త, నేత్ర, అవయవ దానాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి తెలిపారు. యువజన సంఘాలు, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుప్పగండ్లలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, ఆచారి ప్రారంభించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఆచారి మాట్లాడుతూ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వారి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటునందించాలన్నారు. లయన్స్‌క్లబ్ సేవలు మారు మూల గ్రామాలకు విస్తరిస్తున్నట్లు క్లబ్ రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను తెలిపారు. మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్, క్లబ్ జోన్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ్మా, జిల్లా చైర్మన్‌లు రమేశ్, ఓంకారం, రామచంద్రారెడ్డి, అంజిరెడ్డి, జూలూరి రింగయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

యాచారం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యాచారం మండల కేంద్రంలో మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు అన్నారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు బుగ్గరాములు, యాదయ్య, గోపాల్, యాదయ్య, ధనరాజ్, మల్లేష్, భానుచందర్ తదితరులున్నారు.

మంద జగన్నాథ్‌కు మాజీ ఎంపీ పరామర్శ


జగన్నాథ్‌ను పరామర్శిస్తున్న రాములు

ఆమనగల్లు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథ్‌ను బుధవారం మాజీ ఎంపీ పోతుగంటి రాములు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మంద జగన్నాథ్‌ను మాజీ ఎంపీ రాములు, మాజీ జడ్పీటీసీ పోతుగంటి భరత్ ప్రసాద్‌లు పరామర్శించారు. అనంతరం జగన్నాథ్ కూతురు డాక్టర్ పల్లవి, కుమారుడు శ్రీనాథ్‌లతో వారు మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడ్తాల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిచెడ్ గ్రామంలో బుధవారం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. క్రైస్తవుల ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ క్యాలెండర్ ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.